# "ఇప్పుడు నాకు బ్రతకాలని లేదు!"

పేరెపు లక్ష్మి



**జీవితంలో ముచ్చటగా మూడే మూడుసార్లు నాకు చావంటే భయం, బ్రతకాలన్న కోరిక బలంగా కలిగాయి. మనిషి అన్న తర్వాత ప్రతీ ఒక్కడికీ ఈ రెండూ సహజమేగాని.. నాకీ రోజు అవన్నీ గుర్తుకి వస్తూ వుంటే క్రొత్తగాను, అసహజంగాను అనిపిస్తోంది.**

నా పెళ్ళి అయిన క్రొత్తలో.. ఆర్నెల్లకి మా స్కూటర్‌కి యాక్సిడెంట్ అయి నన్ను, నా శ్రీమతి అన్నపూర్ణను హాస్పిటల్లో చేర్పించారు. నాకు సీరియస్ దెబ్బలే తగిలాయి. అప్పటికి పూర్ణకి మూడో నెల. నేను బ్రతకాలి. నా పిల్లలని కళ్ళారా చూసుకోవాలి. వాళ్ళతో ముచ్చట్లాడాలి. పెంచి పెద్ద చెయ్యాలి. ప్రయోజకులైన వాళ్ళని చూసి నేను, పూర్ణ పొంగిపోవాలి. భగవాన్! నన్ను బ్రతికించు. నేను బ్రతకాలి.. నన్ను.. నన్ను చంపొద్దు.

నా మొర ఆలకించాడేమో అప్పటికి ఆ గండం గడిచి బ్రతికి బట్టకట్టాను. భగవంతుడికి నా కృతజ్ఞతలు ఎలా తెలియజేసుకోవడమో తెలియక భక్తుడిగా మారిపోయాను. ప్రతీ శనివారం నేను, పూర్ణ గుడికి వెళ్ళడం అలవాటు చేసుకున్నాం.

రెండవసారి. .నాకు మొదటి సారిగా హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు. అప్పుడు నా వయసు 40కి 50కి మధ్య వుంటుంది. ఇంకా సారథికి, పద్మకి పెళ్ళిళ్ళు చెయ్యలేదు. బాధ్యతలన్నీ ఎక్కడివక్కడే వున్నాయి. పద్మనో ఇంటిదాన్ని చెయ్యాలి. సారథి స్టేట్స్‌లో చదువు పూర్తిచేసుకుని రాగానే వాడి పెళ్ళి చెయ్యాలి. ఇంటర్ చదువుతున్న సుషమని పెద్ద డాక్టర్‌ని చెయ్యాలి. మనవలనెత్తుకోవాలి. తాతయ్యా అని పిలిపించుకోవాలి. వాళ్ళ ఆటా పాటా చూసి, నేను, పూర్ణ వాళ్ళల్లో ఒకరమై ఆడుకోవాలి. ఇవన్నీ జరగాలంటే నేను బ్రతకాలి. అందుకే రెండు చేతులెత్తి దేముణ్ణి మనసా, వాచా ప్రార్థించాను. మళ్ళీ మామూలు మనిషిగా లేచి తిరిగాను. నా గురించి నేను ఎప్పుడూ అంతగా పట్టించుకోలేదు. కాని, ఈసారి కోలుకున్న దగ్గర మంచి బలమైన మందులు వాడాను. పళ్ళు, ఫలాలు తిన్నాను. నా ఆరోగ్యంపట్ల నేను తీసుకుంటున్న జాగ్రత్తలకు నాకే ఒక్కోసారి ఆశ్చర్యమనిపించేది. ఇవన్నీ ఎందుకోసం చేస్తున్నాను? అని నన్ను నేను ప్రశ్నించుకునే వాడిని. బ్రతకాలన్న ఆశ!!

ఈసారి నా కృతజ్ఞతా సూచకంగా ప్రతీ ఏటా తిరుపతి వెళ్ళి స్వామి దర్శనం చేసుకురావడం అలవాటు చేసుకున్నాను

కాని, నా బాధ్యతలనుకున్న పనులన్నీ పిల్లలే సొంతంగా ఎవరికి వాళ్ళు నెరవేర్చుకున్నారు. సారథి స్టేట్స్ మంచి కోడలిని వెంటబెట్టుకు వచ్చాడు. పద్మ వర్ణాంతర వివాహం చేసుకుని ఓ ఉత్తరం ముక్క (తన బాధ్యతగా) రాసి పెట్టి వెళ్ళిపోయింది. రెండు బాధ్యతలు తీరిపోయాయి. ఇంక మిగిలింది సుషమ. అది కూడా మెడికల్‌లో సీటు సంపాదించుకుని వైజాగ్ వెళ్ళిపోయింది. సుషమ కూడా తన దారి తానే వెతుక్కోగలదన్న విషయం నాకు తెలుసు. ఒకదాని వెంట ఒకటి గుండెకి తగిలిన ఈ గాయాలు జీవితంమీద విరక్తిని పెంచాయి. "కాలం మారింది.. మనమూ మారాలి" అంటూ ఒకరినొకరం ఓదార్చుకున్నాం మేమిద్దరమూ. అన్నీ మర్చి పోయి, పద్మని, అల్లుడిని ఇంటికి ఆహ్వానించాం.

జీవితంలో అన్నీ సమకూరినా ఏదో వెలితి! మానసికంగా కోలుకోలేని పరిస్థితుల్లో మరోసారి ఆరోగ్యం దెబ్బతింది. "సారథిమీద బెంగ పెట్టు

కున్నారేమిటండీ? వాడికి రమ్మని ఉత్తరం రాయనా?" పూర్ణ కళ్లనీళ్లు పెట్టుకుంది. మరొక వారం రోజులలో వాడి దగ్గర్నుంచి సమాధానం వచ్చింది. "బెంగ, చూడాలనుంది" ఇలాంటి సెంటిమెంట్స్‌తో నాన్నగార్ని ఆరోగ్యం పాడుచేసుకోవద్దను. నేనేం ప్రక్కనున్న బొంబాయిలోనో, బొబ్బిల్లంకలోనో వుండడంలేదు. ఇక్కడి నుంచి నేను రావాలంటే ఎంత ఖర్చుతో కూడిన పనో మీకు తెలుసుకదా. వచ్చే నెల నీలిమ తన అమ్మా-నాన్నని చూడాలంటోంది. అప్పుడు వచ్చినపుడు రెండు రోజులు వస్తాను. ఖరీదైన మందులు వాడమను. డబ్బు పంపుతున్నాను. ఆరోగ్యం జాగ్రత్త. మీ మనవడు మిమ్మల్ని చూడాలంటున్నాడు" అదీ వాడి ఉత్తరం సారాంశం. మరోసారి బ్రతుకుమీద ఆశ కలిగింది. కాని; ఈసారి పూర్ణ కోసం. తన రక్తమాంసాలు కరిగించి జన్మనిచ్చిన పిల్లలు ఎవరి గూటికి వాళ్ళు ఎగిరిపోయాక నా కోసం తను, తన కోసం నేను అన్నట్లు పండుటాకుల్లా బ్రతుకుతున్నాము. ఇప్పుడు నేను కూడా అన్యాయం చేసి వెళ్ళిపోతే? అందుకే పూర్ణ కోసమైనా బ్రతకాలి.. నన్ను బ్రతికించు భగవంతుడా! అని మనస్ఫూర్తిగా మరోసారి మనవి చేసుకున్నాను.

మూడు గండాలు గడిచి గుండ్రాయిలా తిరుగుతున్న తరుణంలో.. నేను ఒంటరిగా బ్రతకగలననుకుందో, బాధ్యతలన్నీ నెరవేర్చేసాను ఇంక నా అవసరం ఎవరికీ లేదనుకుందో, పిల్లలమీద బెంగే పెట్టుకుందో, అలాంటి సెంటిమెంట్స్ పెట్టుకోవద్దన్న కొడుకు సలహా పాటించి వైరాగ్యం పెంచుకుందో.. కారణమేదైనా పూర్ణ నన్ను వదిలి, అన్యాయం చేసి మరీ వెళ్ళిపోయింది.

అనుకోకుండా అత్తవారింటికి రావడంవల్ల సారథి తల్లిని ఆఖరిసారి చూడగలిగాడు. పద్మ, సుషమ వచ్చారు. ఇల్లంతా ఒక్కసారి సందడిని సంతరించుకుంది. కళ్ళారా చూసే భాగ్యం పూర్ణకి లేకపోయింది. చెట్టంతేసి పిల్లలు చిన్నపిల్లల్లా వలవలా తల్లికోసం ఏడుస్తుంటే నా అంచనాలో ఎక్కడో పొరపాటు వుందనిపించింది. నన్ను వాళ్ళు ఓదార్చవలసింది పోయి నేనే వాళ్ళని తిరిగి ఓదార్చాను.. "ఏడిస్తే మాత్రం అమ్మ తిరిగి వస్తుందా? బాధపడకండి" అంటూ.

రాత్రి ఒంటరిగా కూర్చోలేక, కంటిమీదికి కునుకురాక పిల్లలతో కాలక్షేపం చేద్దామని, మనసులోని బాధను వారితో పంచుకుందామని అని పించి వాళ్ళ గదివైపు వెళ్ళాను. గదిలో దీపం వెలుగుతోంది. ఏదో విషయం చాలా తీవ్రంగా చర్చించుకుంటున్నారు. మధ్యలో ముక్కు చీదుతున్నారు. నా అడుగులు ముందుకి పడలేదు.

"ఉన్న ఫళంగా నేను నాన్నగారిని తీసుకువెళ్ళడం కుదరదు. అలాగని ఒంటరిగా వదిలివెళ్తే నలుగురూ ఏమనుకుంటారు?" సారథి అంటున్నాడు.

"ఇంకొక్క రెండేళ్ళు కదండీ.. ఆ తర్వాత మనమే ఇండియా వచ్చి ఎక్కడో సెటిలైతే మనతో వుంటారు. అంతవరకు ఏదైనా ఏర్పాటుచూడండి" నీలిమ మాటలు.

"ఈ చీర అమ్మ ఎప్పుడు కొనుక్కుందే? చాలా బాగుంది కదూ? ఈ బుటా చూడు.. ఇది నేను తీసుకుంటానే సుషమా .. పద్మ ఆ చీర పైటలా చేసి పైన వేసుకు చూస్తోంది. సుషమ "ఆ మబ్బు రంగు చీర మాత్రం నాకు ఫంక్షన్స్‌కి బాగుంటుంది. అది నాకు వదిలెయ్యి" అంటోంది.

పూర్ణా! నీ చితిమంటలు ఇంకా ఆరాయో లేదో తెలీదు. నువ్వు పంచభూతాలలో ఐక్యమయ్యావో లేదో తెలీదు. నీ రక్తాన్ని పంచుకు పుట్టిన నీ పిల్లలు మాత్రం నీ ఆస్తిని కూడా పంపకాలు వేసుకుంటున్నారు. కన్నతండ్రిని ఒంటరిగా వదిలివెళ్ళిపోతే 'లోకం' ఏమనుకుంటుందోనని బాధపడుతున్నాడు.. పాపం సారథి! అందుకూ నేను బాధపడలేదు. ఎవరి సమస్యలు వాళ్ళవి.

కాని, తల్లి ఫొటో మూడు కాపీలు తీయించి ఫొటోలు ముగ్గురికీ ఇచ్చి నప్పుడు మాత్రం.. "ఇప్పుడీ ఛాదస్తాలు ఎందుకు నాన్నా?" అని వాటిని విడిచి వెళ్ళినప్పుడు.. సరిగ్గా అప్పుడు ఒక్కడుగు తల్లి ఫొటోకే చోటులేని వాళ్ళ ఇరుకు జీవితాలలో ఆరడుగుల నేను ఇమడలేనని అన్పించినప్పుడు.. మొదటిసారిగా జీవితంలో బ్రతకాలన్న ఆశ చచ్చిపోయింది! అవును నాకిపుడు చావంటే భయంలేదు. నాకు బ్రతకాలని లేదు! ●

## సినిమా రంగంలో అపూర్వ సంఘటనలు

# పద్మిని తొలి రోజులు

—డాక్టర్ సత్రాజిత్ "సాగరాజు"

తిరువాన్కూర్ సోదరీమణులైన లలిత, పద్మిని, రాగిణి ఒకనాడు ఎంతో పేరొందారు. బాల్యంలో పద్మిని బలహీనంగా ఉండటంతో, ఇరుగు-పొరుగువారు డాన్స్ నేర్పిస్తే ఒళ్ళు వస్తుందని చెప్పారు. ఆ అమ్మాయి అలా నాట్యం ప్రారంభించింది.



ఎలాగూ పద్మిని నేర్చుకొంటున్నది గనుక లలిత, రాగిణి కూడా డాన్స్‌లోకి దిగారు. ప్రఖ్యాత కథాకళి (కేరళ నృత్యం) నర్తకుడు గోపీనాథ్ వద్ద సశాస్త్రీయంగా నాట్యంఅభ్యసించారు. ప్రపంచ ప్రఖ్యాత నృత్య దర్శకుడు ఉదయశంకర్ (సితార్ రవిశంకర్ అన్న) "కల్పన" హిందీ చిత్రాన్ని నృత్య ప్రధానంగా నిర్మిస్తూ, ఎన్నో నృత్యాలున్నందున వీరిని కూడా బుక్ చేసారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా షూటింగ్, మధ్యలో గంటమాత్రమే విశ్రాంతి. ఆ విశ్రాంతి సమయంలో పద్మిని సైకిల్ నేర్చుకోసాగింది.

ఒకరోజు మధ్యాహ్నం కాఫీ హోటల్‌కు సైకిల్‌పై వెళ్తోంది. వెనుక కొందరమ్మాయిలు (డాన్సర్స్)వస్తున్నారు. హఠాత్తుగా పావడా సైకిల్ చక్రంలో పడింది. సడెన్ బ్రేక్ వేసి ఎగిరి దూకింది. వెనుక ఒక కారుకూడా సడెన్ బ్రేకు వేయాల్సి వచ్చింది. "ఎన్నా అమ్మా, బుద్ధి ఇల్లె" (ఏమ్మా బుద్ధిలేదా) అన్నాడు కారు డ్రైవర్. పెద్ద ప్రమాదం తప్పింది. "ఇక ఎవరూ బయటకు పోరాదు, సైకిల్ తొక్కరాదు" అని శాసించాడు ఉదయశంకర్.

"కల్పన" చిత్రం బాగా ఆడింది. తర్వాత పక్షిరాజావారి "కన్నిక" (అరవం) చిత్రంలో లలిత,పద్మిని స్వతంత్రంగా నృత్యం చేసారు ("కల్పన" లోని కేవలం గ్రూప్ డాన్స్‌లే). ప్రఖ్యాత హాస్యనటుడు ఎన్.ఎస్.కృష్ణన్ తెలుగు తమిళ భాషలలో తీసిన ఎన్‌ఎస్‌కె వారి "పెళ్ళికూతురు" లో పద్మిని తొలిసారి హీరోయిన్‌గా వేసింది. పిదప ఎన్నో తెలుగు, తమిళ, హిందీ చిత్రాలలో నటించింది. "మల్లీశ్వరి"లో తొలుత ఆమెనే హీరోయిన్‌గా తీసుకోవాలనుకున్నారు బి.యన్.రెడ్డి.

